కథానిక:

# పెద్ద చదువు

★

శ్రీ ఓగేటి శివరామకృష్ణ

జానకి రామయ్యా పరీక్షలో కృతార్థుడయ్యాడన్న సంగతి తెలిసి యింటిల్లిపాదీ చెప్పలేని ఆనందాన్ని అనుభవించారు. ఆనందంతోపాటు ఒక విధమైన బాధ తండ్రి సత్యనారాయణలో అలుముకొంది. తనకు చాతనయినంతవరకూ— అంటే తనకు శక్తి ఉన్నంతవరకూ - హైస్కూలు విద్య చెప్పించాడు. ఏదోవిధంగా జానకి రామయ్యా దాన్ని పూర్తి చేశాననిపించాడు.

నిజంగా సత్యనారాయణ కొడుకును హైస్కూలు చదువు చదివించటానికే యెంతో ప్రయాసపడవలసి వచ్చింది. ఒక్కొక్క దినం యింట్లో బియ్యపుగింజలు లేక పోటం గూడా తటస్థించేది. జీతాలు పెనాల్టీలతో కట్టవలసి వచ్చేది. ఎన్ని వచ్చినా ఓపికతో భరించేవాడు; ఇంట్లో భోజనం ఉన్నా లేకపోయినా- జానకిరామయ్య స్కూలు జీతం మాత్రం వడ్డీతో సహా— అంటే జరిమానాతో సహా కట్టేవాడు! ఓ వెయ్యి రూపాయలకిమ్మతు యిల్లుమినహాగా సత్యనారాయణకు స్వార్జితం మరేంలేదు!

చిల్లికానీ దగ్గరనుంచి కూడబెట్టి... ఆరు రూపాయలూ... తయారుచేసి ... జానకిరామయ్యకి తండ్రి యిస్తూ... మొఖంమీద ఉన్న చెమటను తుడుచుకొంటూ ఉస్సురనుకొనేవాడు. తన వయిపు- యేదో పెద్ద ఆశపెట్టుకొన్నవిధంగా చూచేవాడు.

జానకిరామయ్య కన్నీ అర్థమయ్యేవి. తండ్రి -ఏఉద్యోగం లేకను యేవిధంగా బాధపడ్తున్నాడో— తినీ తినకుండా— పొట్టలు వంకెకు తగిల్చి తామేవిధంగా గౌరవంగా జీవిస్తున్నదీ వానికి తెల్సు. ఎంత కష్టనిష్టూరాలు వచ్చినా - తండ్రి తన్ను ఒక్కమాటయినా అనేవాడు కాదు! ఏమయినా కొంచెం తల్లి కసురుకొంటే 'పాపం... వాడినేం అనకేం... అలసి సొలసి వస్తున్నాడు' అనేవాడు. తల్లి యేమేమో అని సాధించేది. కాని తండ్రి తిరిగి భార్యను కసురుకొనేవాడు.

ఇంట్లో యెన్ని కష్టాలున్నా, తన చదువు సంధ్యల విషయంలో మాత్రం తండ్రి యేవిధమైన అడ్డంకులూ చెప్పేవాడు కాదు. తన యిష్టాన్ని సాగనిచ్చేవాడు.

తండ్రి పడుతున్న కష్టాలు కళ్ళార చూస్తూ తెలుసుకొనే శక్తి, తనలో ఉండి కూడా తానేమీ చేయలేకపోయేవాడు; అయితే తండ్రి సంసారాన్ని యీదటంలో పొందుతున్న కష్టాల్ని కన్నులారా చూస్తూండేవాడవటంవల్ల— తన చదువు సంధ్యల్లో మట్టుకు చాలా జాగర్తగా మసులుకొనేవాడు; చదువులో యెప్పుడూ అశ్రద్ధ చూపించేవాడు కాదు. అందుమూలాన్నే అతడు పరీక్షలో కృతార్థుడవటం జరిగింది... కుమారుడయితే పరీక్షయందు కృతార్థుడయ్యాడు కాని తర్వాత అతడి భవిష్యత్తు యేవిధంగా నిర్ణయించవలయునో యేమీ సత్యనారాయణకు ఉద్దేశమే లేదు.

అందువల్ల ఒక విధంగా సత్యనారాయణ కుటుంబం కొంచెం విచారించింది.

'చదివినంతవరకూ చదువు చాలు - ఏదయినా ఉద్యోగం చూడండి. మనకీ చదువు చాలు' అంది జానకి రామయ్యతల్లి!

నిజంగా జానకిరామయ్య మనస్సు చివుక్కుమంది- అతడికి కష్టనిష్ఠూరాలు- యింటి పరిస్థితులూ అన్నీ తెలుసు! అయితే చదువుమీదుండే ఆపేక్ష అతడ్ని ఆ విధంగా చివుక్కుమనిపించింది.

చదువు సంధ్యల్లో తానోవిధంగా- మంచి మార్కులు సంపాదించుకొన్న వ్యక్తి కాకపోయినా

యేవో ఒక విధమైన మంచి మార్కులు సంపాదించుకొంటాడు. అందువల్ల- రిజల్టు చూచిన స్నేహితులు అప్పటికప్పుడే - 'ముందు చదువు మానకోయ్, మంచి తెలివైనవాడవ్' అని అన్నారు.

వారి కేం తెలుస్తాయ్ తన స్థితిగతులు-తనకు మాత్రం చదవాలని లేదూ?—

'అవును... ఉద్యోగం చెయ్యటం తప్పనిసరి.. కుటుంబపరిస్థితులు యోచిస్తే... అలా తోస్తూంది' అన్నారు కొందరు—దూరం యోచించినవారిలా.

స్కూలుఫైనలు చదువుతో - గుమస్తాగిరీ చేయటం-నిండీ నిండని మెతుకులు తినటం - యీ కక్కుర్తి యెందుకు నాయనా. మేంపడుతున్నాంగా బాధలు. కష్టసుఖాలు మనుష్యుల వెనకాల యెప్పుడూ ఉండేవే. ఏలాగోలా ప్రయత్నించు. చివరికి కాలేజీ చదువైనా పూర్తిచెయ్యి. ఏదో కాస్త హోదాగల ఉద్యోగమైనా లభిస్తుంది' అన్నాడొక గుమస్తా... యధార్థతని వెలిబుచ్చుతూ...

'ఏలాగోలా... ఉట్టెక్కావ్... మరి స్వర్గానికెక్కటం ప్రయత్నించకు నాయనా ... ఉట్టికెక్కలేనివాడు, స్వర్గానికి యెలా యెక్కగలుగుతాడు! ఉట్టెక్కినావ్. చాల్లెద్దూ' అన్నాడు వేరొక హితాభిలాషి...

ఈ మాటలన్నీ జానకిరామయ్యమనస్సులో తిరుగాడుతూనే వున్నాయ్. అందరిమాటలు బాగా ఆకర్షించాయ్... వారనేమాటల్లో నిజాలు లేకుండా లేవు. వారు చెప్పినదంతా సత్యమే!

జానకి రామయ్య దూరపు యోచన ఆ కొద్ది కాలంలోనూ చేయలేకపోయాడు. యేదో విధంగా పై చదువు చదవాలనే- అతడికి కాంక్ష- ఏవిధంగా అని ప్రశ్న వేస్తే జవాబు రావటం చాలా కష్టం- ఏదోవిధంగా డబ్బు సంపాదించాలని అతడనుకొన్నాడు.

కాని తల్లి యీవిధంగా అనేసరికి జానకిరామయ్యకు ఒక్కమారుగా ఆమెను మింగేయాలన్నంత కోపం వచ్చింది...నిజంగా వీలుంటే మింగేసేవాడేమో కూడాను. 'నువ్వెప్పుడూ అలాగే అంటావ్'- అన్నాడతను. అంతకన్న తల్లిని—తండ్రి యెదురుగా యేమీ అనలేకపోయాడు.

తండ్రి గూడా జానకిరామయ్యను సమర్థించాడు:'శుభం పలకరా మంకెన్నా అంటే అదేమిటి... వాడు చదువుకొనటానికి ఉత్సాహం చూపుతున్నప్పుడు మనం అభ్యంతరం చెప్పగూడదు. ఎటొచ్చీ- ఏవిధంగా చదివించటమా అనేదే ఆలోచించవలసిన విషయం'—

జానకిరామయ్య తండ్రిమాటల్లో నిజం తెలుసుకొని ఆసమయంలో మరేం అనలేకపోయాడు. సత్యనారాయణ నిజంగా కొడుకును మరి ముందుకు చదివించే పరిస్థితిలో లేడు. ఈ చదువుకే—ఎన్నో అడ్డంకులు వచ్చిపడ్డాయి. కాని ఆ భగవంతుని దయవల్ల —జానకిరామయ్యఅదృష్టంవల్ల—పరీక్షలో కృతార్థుడవటం తటస్థించింది. ఆ దినం—ఎంద రెందరి ముఖాలు ఆనందాన్ని వెలిబుచ్చాయి. కొంతమంది పత్రికల్లో తమ ఫలితాల్ని చూచి విచారించారు. మరి కొంతమంది దుఃఖంతో బావురుమన్నారు. వారందరికీ...వారి పరీక్షఫలితం తప్పటం వల్లనయితే —పరీక్ష ప్యాసయినందుకు గాను జానకిరామయ్య విచారించవలసివచ్చింది. ఏదో విధంగా చదువయితే పూర్తిచేశాడన్నమాటే గాని—ముందు విషయం యోచించుకొంటే—అతనికి చెప్పలేని విచారం అలుముకురావటం మొదలుపెట్టింది. తాను మరి పరీక్షలో కృతార్థుడవటం వల్ల ప్రయోజనం యేమిటి ?

ఏలాగో రెండు మూడు దినాలు గడిచాయి. అదృష్ట దురాదృష్టాలు దైవంమీద వదలి సత్యనారాయణ కుమారుడిచేత...ఉద్యోగాలకు దరఖాస్తులు పెట్టించాడు. ఉద్యోగాలతోబాటు కాలేజీలకు గూడా సీట్లకోసం దరఖాస్తుచేయటం వల్ల జానకిరామయ్య అప్పటికి అడ్డు యేమీ చెప్పలేదు.

జానకిరామయ్య అదృష్టంవల్ల ననండి మరేమనండి—వ్రాసిన కాగితాలు ఉపయోగం లేకుండా పోలేదు. పెట్టిన ప్రతీ ప్రయివేటు కాలేజీలోనూ, అతనికి ప్రవేశం లభించింది. మరి పోయి చేరటమే తర్వాయి. అక్కడే వచ్చింది చిక్కు.

ఉద్యోగాలకోసం జానకిరామయ్య ప్రత్యేకం నాలుగు మూడు దరఖాస్తులు చేస్తే అందులో ఒకటి మాత్రం ఫలించింది. తాత్కాలిక ఉద్యోగం అది. తాలూకాఫీసులో యెవరో గుమస్తా సెలవుపెట్టడం

వల్ల లభించిన ఉద్యోగం అది...మూడు మాసాల కాలందైనం అనుకూలిస్తే ఉంటుంది. ఆ ఉద్యోగానికి గూడా...రికమెండేషన్ల అవసరం కలిగింది. జంచె పుపోగువాడవటంవల్ల వెంటనే ఉద్యోగం లభించటం కష్టంకదా! ఈవిషయంలో తండ్రి వెనక తెరభాగవతం—జానకిరామయ్యకు కొద్దిగా కూడా తెలియదు. అందువల్ల అంతా తన ప్రతాపంవల్లనే అని అతడనుకొనటం సంభవించింది.

అయినా—స్వేచ్ఛగా బ్రతికిన తనను నౌకరీ అనే తాళ్ళతో—తండ్రి కట్ట ప్రయత్నించటం—జానకిరామయ్య కిష్టంలేకపోయింది. తండ్రి ముందు విముఖత చూపించాడు: 'నేనేదో చదువుకొందామని ప్రయత్నిస్తుంటే—నన్నిలా నౌకరీలో చేరమంటా వేమిటి నాన్నా?' అని అంటూంటే జానకిరామయ్య తండ్రిమాత్రం ఏంచెప్ప కల్గుతాడు? 'అబ్బీ యిప్పుడు ఉద్యోగం చేసినంత మాత్రాన వచ్చిపడే నష్టంయేమిటి ...రెండు నెల్ల కాలం ఊరికే కూర్చొనే కంటే—ఏదో ఉద్యోగం చేసుకొంటూంటే—ఏదో నాలుగు రాళ్లు కూడబెట్టుకోకల్గుతావ్—మొదటి జీతం మటుకయినా సంపాదించుకో కలుగుతావ్'—అని అన్నాడాయన.

తండ్రి అన్న మాటలు జానకిరామయ్యకు రుచించాయి. మరేం అడ్డు చెప్పకుండా డ్యూటీలో జాయనయ్యాడు.

మొదట్లో జానకిరామయ్య కంతా అగమ్యగోచరంగా కన్పించింది...గుమాస్తాగిరీలోని సాధక బాధకాలు అత డుద్యోగంచేసిన కొద్దిరోజుల్లోనే అతడికి అవగాహన అయ్యాయి...కక్కుర్తితో కాఫీ నీళ్ళకు సహితం—చేయిచాచటం—అతడికి సిగ్గు, నామర్దాలను కల్గించింది. కాని అవతలవాళ్ళు స్వయంగా యిచ్చేదాన్ని వద్దని అనలేక తీసుకొని జేబులో వేసుకునేవాడు!

అతడు చేసిన రెండు నెల్ల ఉద్యోగకాలంలోనూ—జీతం—అరవై అయిదు రూపాయలూ కాక—మొత్తం నూటయాభై రూపాయలు పైన నిలువ చేయ్యకలిగాడు!

కాలేజీలు...మరి పది పదిహేను రోజుల్లో తెరుస్తారు. జానకిరామయ్య ఉద్యోగానికి రాజీనామా యిస్తానని కాలేజీలో వెళ్ళిచేరుతానని తొందర చూపించాడు...తాను కాలేజీలో చదవకపోతానా అనేధీమా అతనిలో ప్రవేశించింది. అతడివద్ద దాచిన మొత్తం నూటయేభై రూపాయలూ! తన చదువుకు సరిపోతుందని అతని భావన.

వచ్చిన ఉద్యోగాన్ని స్వయంగా పోగొట్టుకొంటాననటం జానకిరామయ్యతండ్రికి ఇష్టంలేకపోయింది. తనకు చదివించే శక్తిలేనప్పుడు-ఉన్న నూటయేభై రూపాయలతోనూ కుమారుడు చదువు...కాలేజీ చదువుకు ప్రారంభోత్సవం చేయటంవల్ల ఉపయోగంలేదని ఆయనకు తెలుసు. అందుకనే 'అబ్బీ—చేతులారా బంగారుపడి ఉద్యోగం పాడుచేసుకొనటం యెందుకూ—వచ్చే నెలాఖరువరకూ కాలేజీలో చేర్చుకొంటారట, చేరవచ్చు. తొందర యెందుకూ?' అన్నాడు తండ్రి.

అవిషంగా తండ్రి మాట్లాటుషం జానకిరామయ్యకిష్టం లేకపోయింది. అయినా—చేరచ్చనే'- తండ్రి మాట మాత్రం అతడ్ని శాంత పురుషుడిగా చేసింది.

మరో పదిహేను రోజులు గడిచాయి ఎప్పుడు తాను కళాశాలలో చేరుతానా- ఎప్పుడు కాలేజీ విద్యార్థినవుతానా అని పగటికలలు కంటూనే ఉన్నాడు జానకిరామయ్య!

జానకిరామయ్య పని చేస్తున్న ఆఫీసుకు తోటి బ్రాహ్మణ గుమస్తా ఒకాయన బదిలీ అయివచ్చాడు. ఆయనకు జానకిరామయ్యను చూడటంతోటే యేవేవో కోర్కెలు మనస్సులో మెదలి—ఆచరణలోనికి వాటిని తీసుకొనిరా ప్రయత్నించాయి. ఆయన జానకిరామయ్యతో 'ఏమయ్యా పంతులూ— ఇంత చిన్నవాడకప్పుడే ఉద్యోగంతో ప్రవేశించావేమిటి? ముందు చదువుకోసం ప్రయత్నించలేక పోయావా?' అని ప్రశ్నించాడు.

జానకి రామయ్య వినయంగా— తాను చదవటంలో ఉండే సాధక బాధకాల విషయం యేకరువు పెడుతూ—కుటుంబ పరిస్థితులను తెలియపరుస్తూ—ఏలాగయినా, చదువుదామనే ఉద్దేశంలో ఉన్నానని—ఏవిషంగా అనేది ఆలోచన లేకుండా ఉన్నదనీ చెప్పాడు.

అంతే—ఆయన చేసిన సారథ్య ఫలితం ఫలించింది.

ఆ సాయంకాలం సత్యనారాయణ యింటికి వచ్చి విషయం భార్యతో అంతా చెప్పాడు. ఆఫీసులో పని చేస్తున్నాయనకో అమ్మాయి వివాహ వయస్సు వచ్చినది ఉన్నదట. ఆ అమ్మాయిని—జానకిరామయ్యకు యిచ్చే వుద్దేశంలో ఉన్నట్లు—కట్న కానుకల విషయం యేం యిచ్చుకొనలేకపోయినా— అబ్బాయి ముందు చదువుమాత్రం—తాను దగ్గరుండి చదివిస్తానని వాగ్దానంఇచ్చాట్ట' ఇష్టమయినట్లయితే అంగీకారం తెల్పటంతడవుగా తాంబూలాలు పుచ్చుకొనవచ్చు'— అన్నాడు సత్యనారాయణ జానకిరామయ్యవైపు చూస్తూ:

సత్యనారాయణా, ఆతని భార్య జానకిరామయ్యపై వేరే ఆశలు పెట్టుకొని ఉన్నారు. జానకిరామయ్య పెండ్లికి వచ్చే కట్నంతో తమ కుమార్తె పెండ్లి యేదోవిధంగా చేసేయాలనే తలంపువాళ్ళలో ఉంది. అన్నీ కలసివచ్చే సమయం యెప్పుడా అని వాళ్ళూ యెదురుచూస్తున్నారు. ఈవిధంగా జానకిరామయ్య ముందు చదువు చదువుకొనటం అభివృద్ధికి రావటం తమకు యిష్టమేగాని—కుమార్తె చదువు సంగతి!

విషయం తెలిసినతరువాత— తల్లితండ్రులు ముభావంగా ఊరుకొంటే జానకిరామయ్య మరి ఊరకొనలేకపోయాడు.

రెండుమూడు రోజుల కాలం దొర్లిపోతూంది—కాలేజీలో చేరే సమయం— ముగియుట గూడా జరుగుతోంది.

సిగ్గు విడిచి జానకిరామయ్యే తేల్చి అనేశాడు. 'మరి చదువుసంగతి యేం తేల్చావు నాన్నా' అని

సాధక బాధకము లాలోచించిన సత్యనారాయణ 'అబ్బీ యేం చెప్పనురా— నీదగ్గరవున్న డబ్బు ఓ సంవత్సరాని కయినా సరిపోదు గదా! చేతుల మీద బ్రతికేవాళ్ళం ఏ రోజు బత్తెం ఆరోజు మాసుకొనేవాళ్ళం— మరేం చెయ్యగలంరా' అని అన్నాడు!

తండ్రి మాటలతో జానకిరామయ్యకు కోపం పుట్టుకొచ్చింది.



'ఇన్ని కబుర్లూ చెప్పి— యీ విధంగా తయారు చేశావా' అని అన్నాడు- క్రోధం కన్పరుస్తూ జానకిరామయ్య.

ఏం చెయ్యమంటావురా 'నాయనా'— అని తిరిగి నెమ్మదిగానే సత్యనారాయణ హితవచనాలు చెప్పబోయాడు.

'అయితే చదివించనంటావ్'— అన్నాడు తేల్చిపార వేయాలన్నట్లుగా జానకిరామయ్య! 'ఏం తేల్చమంటావురా నే చదివించలేను-నీచేతులమీద నువ్వు నడుచు కొనటం గూడా కష్టం. మరేం చెప్పను'- అన్నాడు సత్యనారాయణ.

అంతవరకూ— తన పెండ్లివిషయం జరుగుతున్న సంప్రతింపుల విషయం తెలిసుండి గూడా తెలియనట్లుగానే నడుచుకొంటున్నాడు జానకిరామయ్య.

'మరేం చెప్పను'-తండ్రి అనటం తర్వాయిగా జానకిరామయ్య అన్నాడు: 'అయితే—ఆయన—చెప్పిన ప్రకారం చేస్తే శుభ్రంగా చదివించుతానన్నాడుగా?'

'ఎవరూ-మీ ఆఫీసుగుమస్తాగారా?' అన్నాడు తండ్రి-తల్లి వైపు చూస్తూ!

ఆ చూపుల్లో అర్థం ఆ భార్యాభర్తలకే తెలియాలి! 'నాయనా—నామాట విను- పెద్ద చదువులు చదివి ఈ రోజుల్లో యెవరేం పెద్ద ఉద్యోగాలు వెలగబెడుతున్నారు? ఉన్నదానితో సంతృప్తిపడి—నడుచుకోటం చాలామంచిది'—అంది తల్లి.

'నే చదివితీరాలి'—అన్నాడు మూర్ఖంగా జానకిరామయ్య. తల్లీ తండ్రీ మాట్లాడక ఊరుకొన్నారు!

'ఏం ఏమంటావ్? చదివితీరాలి. ఏం నాన్నా తేల్చండి'—అన్నాడు జానకిరామయ్య తిరిగి... "చదవాలనే ఆదుర్దా ఉండటం సహజంగాని నాయనా—ముందు భవిష్యత్తువిషయం కొంచెం అయినా యోచించవా నాయనా" అంది తల్లి ముందు వెనుకలు యోచించిన దానిలా.

'ఆయన యేదో అన్నారుగా!'—అని...జానకిరామయ్య చెప్పబోయి ఆపేశాడు:

తల్లీ-తండ్రీ—విషయం గ్రహించుకొన్నారు. సత్యనారాయణ భార్యవైపు చూశాడు. ఆమె జానకి రామయ్యవైపు చూస్తూ అంది: 'అవున్నాయనా... నువ్వన్నట్లుగా— వాళ్ళ మాట కంగీకరించితే— తప్పకనీముందు చదువు సాగుతుంది. అయితే— నీ పెండ్లి విషయంలో యేదో ఆశపెట్టుకొని జీవిస్తున్న మేం— యీ విధంగా నువ్వంటే యెట్లా.'

తండ్రి అన్నాడు: 'ఏదో నీ పెండ్లికివచ్చిన కట్న కానుకల్తో—యేదోవిధంగా నీ చెల్లెలు పెళ్ళి జేసేయాలనే ఆదుర్దాతో మేం ఉన్నాం ఆ శుభ ముహూర్తంకోసం యెదురుచూస్తున్నాం.' అని...

జానకిరామయ్య కొద్ది కాలం యేం మాట్లాడాలో తెలియక తబ్బిబ్బులు పడ్డాడు! నిజానికి కష్ట సుఖాల్లో పాలుపంచుకొని— మసులుకోవలసిన తాను— యీ విధంగా మంకుపట్టుకు కూర్చోనటం యేమి బాగుంది?

విద్యార్థిగా జానకిరామయ్యకు ముందుకు చదవాలనే ఆదుర్దా యీ విషయాన్ని దూరం యోచింపనియ్యలేదు. అతని మనస్సు మరోవైపు పయనం చేసింది.

'దానికీ దీనికీ లంకెపెట్టడం దేనికి? చెల్లెలు పెళ్ళికోసం —నాచదువు సంధ్యలు పాడుచేస్తారా? —ముందు మనకేం అదృష్టం కలగ్గలుగుతుందో! మీరీ విధంగా అనడం నాకేం నచ్చలేదు-ఈవిషయంలో మీరు స్వేచ్ఛ యిచ్చి ఉండినట్లుయితే తప్పక అంగీకరించి ఉండే వాడ్ని' అన్నాడు జానకిరామయ్య!

సత్యనారాయణా, భార్యా—జానకిరామయ్య ఉద్దేశాన్ని గ్రహించారు. ఏవిధంగా ఏనిముషంలో — ఏలా — మనస్సును మార్చుకోగలిగారో జానకి రామయ్యతో మాత్రం 'అబ్బీ, నీ యిష్ట ప్రకారంగానే జరుపు- ఎవరి అదృష్టం- ఏలాగుంటే ఆలా జరుగుతుంది'—అన్నారు.

జానకి రామయ్య కప్పుడు కల్గింది, తల్లితండ్రుల్ని బాధపెట్టానేమో అన్నియోచన.

'అది కదమ్మా! నే పెద్దచదువు చదివినట్లయితే- పెద్ద ఉద్యోగం చేయటం తటస్థించినట్లయితే- చెల్లెలికి పెద్ద మొగుణ్ని యేరి, కోరి వివాహం చెయ్యకూడదూ!'— అన్నాడు జానకిరామయ్య- అన్న మాటలు దాచ ప్రయత్నిస్తూ.

'సరే ఆలాగే కానిద్దాము లేవోయ్'- అన్నాడు తండ్రి.

పిల్లరూపసి అయినదీ కాకపోయినదీ యిటు జానకి రామయ్యగాని, అటు తల్లితండ్రులు గాని యోచించలేదు: జానకిరామయ్యకు కావలసింది చదువు— అతని తల్లితండ్రులకు కావలసింది-తమ తమ మంచీని.

జానకిరామయ్యకు- అనుకోకుండా వివాహం జరిగిపోయింది... ఉద్యోగం వదలి.. జానకి రామయ్య చదువుకొనటానికి కాలేజీకి వెళ్ళాడు. సత్యనారాయణకు తిరిగి కష్టాలు ప్రారంభమయ్యాయి.

* * *

అయిదారు మాసాలకాలం చదువు సాగీసాగకుండానే—... ప్రయత్నం చేసి జానకి రామయ్య మామగారు— అతడు చదువుతున్న ఊరికి బదిలీ చేయించుకువచ్చేశాడు. అది అన్ని విధాలా ఆయనకు లాభదాయకమే. అల్లుడు ఒక చోట చదువుతున్నప్పుడు— తానొక చోట నుంటూండటం-కష్టం సంగతటుంచి— అతనికి ప్రతీమాసం నూరు రూపాయల కాగితం పపంటం ఆయనకు చాలా కష్టంగా ఉండేది. తోడుతోడుగా వస్తున్న... పై డబ్బు యింటి ఖర్చులకు సరిపోవటంలేదు. తను కోరుకొని బదిలీ చేయించుకొన్న పక్షంలో మరేవిధంగానూ — అతనికి ఆటంకం ఉండదు; ఆ సంగతి అటుంచి— అల్లుడు జీతండబ్బుమినహాగా తాము తెచ్చికట్టిపెట్టవల్సిందేమీ ఉండదు. ఇంట్లో తిండితింటాడు. — పడుకొంటాడు. అందువల్ల యీ విధంగాబదిలీ చేయించుకొనటంవారికి లాభదాయకమే!

జానకి రామయ్య తన కోర్కెలు నెరవేరుతున్నందుకు సంతోషించాడు...అయితే ఆరు మాసాలకాలంలో వారు వీరవుతారనే సంగతి అతడికి గుర్తులో ఉండి ఉండదు.

వారు అక్కడకురాని క్రితం జానకిరామయ్య స్వేచ్ఛగా— బ్రతికేవాడు...పంపుతున్న పది పదుళ్ని— తీసుకొని చక్కగా జమీందారు బిడ్డ

విధంగా ఖర్చు పెట్టుకొనేవాడు:—తన పూర్వస్థితి మర్చితానొక యేదో యేమో క్రింద సంచరించేవాడు.

అత్తమామలు కాపురం పెట్టడంతోనే ముసలం ప్రారంభమయింది. తన మంచి కోరుతున్న వారి విధంగా—తనవద్దకు వచ్చేటప్పుడు వద్దని చెప్పటం యే విధంగా సాధ్యమవుతుంది?

అందువల్ల నే మాట్లాడకూరుకునేవాడు. ఇంటి వారితోపాటు—తానొక సభ్యుడయ్యాడు. సభ్యుడుగా భోజనం చేయటం బయటకు పోవటం—మొదట్లో జానకిరామయ్యకు అంత యిష్టత కలిగించేవి కావు. తనకుతాను సంపాదన యేమీ లేకుండా యితరులమీద ఆధారపడిఉండటం—అతనికి సిగ్గుచేటుగా కన్పించేది.

రోజులుగడిచేకొద్దీ—అతనిలోగూడ పరిస్థితులు మంచి మార్పును తీసుకొనివచ్చాయ్. ప్రతివిషయానికీ చేయెత్తి— డబ్బును కోరటం— అంతమంచిది గాదని తెలిసివచ్చింది.

తోడుగా- కాలేజీ జీతాలు కట్టవలసిన సందర్భంలో ఒకటి రెండు మార్లుమామ మరేం అనుకోకుండా యిచ్చినా తర్వాత తర్వాత... 'చాలా చిక్కుగా ఉందోయ్' ఏదో విధంగా మూసికట్టేద్దూ అనేవారు. ఆయన అవసరం తీరిందిగా! తానే ఏదోవిధంగా కట్ట గలుగుతాడని. ఆయన ఉద్దేశం!

జానకిరామయ్య యువక రక్తం వేడెక్కింది. తల్లి- తండ్రులమాటలు తెలిసివచ్చాయి. తాను—చదువుతానని పట్టుపట్టడం యీ విధంగా జరిపించటం జరిగింది— నిజంగా వాళ్లన్నట్లుగా గుమస్తా నౌకరీ చేసుకొంటూంటేనే బాగుండేదేమో!

ఏదో మామగారిమీద ఆశ పెట్టుకొని— నిలవుంచిన డబ్బు తన పెండ్లి సమయంలో తండ్రిచేతులో పోశాడు. డబ్బు కొందరి చేతుల్లో పాదరసం విధంగా జారిపోతుంది. సత్యనారాయణ చేయి గూడా అలాంటిదే! చేతులో పడటం తర్వాయిగా- ముందు వెనుకలు ఆలోచించకుండా— వివాహం సందర్భంలో దాన్ని ఖర్చు పెట్టేశాడు!

మరి దారి? మామతో మంకుపట్టు పట్టి దెబ్బలాడటం- రచ్చకు పోవటం- ప్రతి విషయానికి అల్లరిచిల్లరగా పైకిపోవటం-ఒకరి మనస్సులు బాధపెట్టడం మంచిది కాదని జానకి రామయ్య ఉద్దేశం. అందువల్ల అతడు మాట్లాడక ఊరుకొన్నాడు!

మామ తనతో ఆవిధంగా అన్నతర్వాత ముఖం చిన్నబోయింది. ఒకళ్ళమీద ఆధారపడ్డ బ్రతుకు యింతేకదా అని అనుకొన్నాడు—... కాలేజీకి జీతం కట్టాలి! తప్పదు—గత్యంతరం?

తల్లి తండ్రుల్ని డబ్బు పంపమని వ్రాస్తే పంపటం చాలా కష్టం-వయస్సువచ్చిన తాను వారికి సాయం చేయటం సంగతి అటుంచి తిరిగి వారిని బాధపెట్టడమా! ఆ విషయం అటుంచి మామ డబ్బు విషయంలో యీ విధంగా అన్నారన్న సంగతి తెలిస్తే- వియ్యంకు లిరువురూ యుద్ధకాండ ప్రారంభించుకొనటం గూడా జరుగుతుంది.

జానకిరామయ్య చాలా దూరం యోచించాడు. ఈ విషయం తల్లితండ్రులికి తెలియనివ్వగూడదు; ప్రస్తుతం జీతం గట్టడం యెల్లాగా?—.. తెగించి— ధైర్యంచేసి- ఎవరి, నయినా అప్పడుగుదామని ఉద్దేశపడ్డాడు జానకిరామయ్య!

వారికి తీర్చేవిధానం—... ఏదో మార్గం వెతుక్కోవాలి—.. అని అతని మనస్సు ధైర్యం కల్గించింది.. మరి మామను డబ్బు అడగకూడదని నిశ్చయం చేసుకొని మనస్సును దిట్ట పరచుకొన్నాడు.

సాయంకాలానికి — తోడివిద్యార్థిస్నేహితుడ్ని బదులు అడిగి— కాలేజీ జీతాన్ని కట్టాడు;

సాయంకాలం యింటికి వచ్చిన తర్వాత—మామయ్య కాలేజీకి కట్టవలిసిందని డబ్బు యివ్వబోయాడు:

'అవసరం లేదండి' — అన్నాడు జానకిరామయ్య ముభావంగా 'ఏం'- తిరిగి ప్రశ్న.

'కట్టేశానండి'—

తిరిగి ప్రశ్న వేయటానికి కొద్ది నిముషాల కాలం పట్టింది. ఆ విధంగా జవాబు జానకిరామయ్య యిస్తాడని ఆయన అనుకొని ఉండడు.

'ఎక్కడిది?'—

'ఏదో చూశానండి'-

—మరి తిరిగి ఆయన మాట్లాడలేకపోయాడు. ఆ దినంనుంచీ జానకిరామయ్య యింట్లో తిరుగుతూన్నా — కొంచెం ముభావంగానే ఉండేవాడు:

సమయానికి అదృష్టం కొద్దీ—..,యాభైరూపాయల ట్యూషనొకటి అతనికి లభించింది. మరేం కొదువ! నామ మాత్రానికి—వారింట భోజనం చేస్తూ-యే విఘ్నమైన అడ్డంకులూ లేకుండా చదువుసాగించాడు ...తిని ఉంటున్నవాడు - కుక్కిన పేనులా ఉంటాడనీ —తా మెలా చెబితే ఆ విధంగా నడుచుకొంటాడనీ జానకి రామయ్య మామా వగైరాలు ఊహించి ఉంటారు. ప్రారంభంలో —.. డబ్బు అవసరం లేదన్నా — తర్వాత తర్వాత నయినా మరి అడగకుండా వుంటాడా? తా నివ్వకండా ఉంటాడా? అనే ఉద్దేశాన్ని ఆయిన పొందాడు. ఆయన గూడా ముభావంగానే అందువల్ల ఊరుకొన్నాడు.

జానకి రామయ్య గూడా తన పట్టుదల నెగ్గించుకొనటానికి ప్రయత్నించాడు. ప్రయివేటు చెబుతూండటంవల్ల లభిస్తున్న యేభై రూపాయల మూలకంగా 'దేహి' అని ఒకర్ని అడగవలసిన అవసరం వానికి కల్గలేదు.. ఒక వేళ — అవసరమైనప్పటికి — యేదో యే స్నేహితులోన్న — అప్పటి కప్పుడు అడగటం - తర్వాత సర్దుబాటు చేస్తూండటం జరుపుతూండేవాడు.

తా మనుకొన్నవిధంగా ... మరి జానకి రామయ్య డబ్బు అడక్కుండే సరికి — మామయ్య కొంచెం ఖంగారు పడ్డాడు. ఎటునించి యే విధంగా వస్తుందో అని ఆయన భయం — ఈ సంగతి జానకి రామయ్య తల్లి తండ్రులకు చెప్పి ఉంటాడని, వారి మూలకంగా డబ్బు సంపాదించి కట్టుతున్నాడనీ ఆయన అభిప్రాయపడ్డాడు! వియ్యంకుల రభస-తప్పదు — అని ఆయన దృఢనిశ్చయం చేసుకొన్నాడు జానకి రామయ్య తత్వం తెలయనివాడవటం వల్ల !

ఓమారు ఎంతకీ డబ్బు తీసుకోకుండే సరికి—.. దూరం యోచించి, స్వయంగా తానే కాలేజీకి పోయి జీతం కట్టాడు; మామయ్య!. జానకిరామయ్య కాసంగతి తెలియదు - మామూలుగా తానూ కట్టాడు. కానయితే జీతం ఎవరో కట్టిన కారణంవల్ల డబ్బు తిరిగి యిచ్చి వేశారు. జానకిరామయ్య ఊహించాడు. తన పేరుతో యెవరు జీతం కట్టారా అని — ఒక వేళ తన మామయ్య అయిఉండొచ్చు — ఈ ఉద్దేశం అతనికి కల్గింది.

ఆ సాయంకాలమే—ఆయన్ని ప్రశ్నించాడు. 'ఏమండీ మీరు — నాకాలేజీ జీతం గాని కట్టారా?' అని—

'ఆ' — అని ఆయన జవాబిచ్చాడు — .. జానకిరామయ్య వైపు తేలిపార చూస్తూ..

అప్పటికి జవాబు చెప్పటం కాని — తిరిగి డబ్బు యివ్వటం గాని జరప లేక పోయాడు జానకి రామయ్య.

కాని మర్నాడుమాత్రం మీ రెందుకు కట్టారూ? నే కట్టుకొందును గా'— అంటూ — డబ్బు ఆయనకియ్యబోయాడు. జానకిరామయ్య!

జానకిరామయ్య చేస్తున్నపని ఆయనకు విపరీతానీ్న, ఆశ్చర్యాన్నీ కల్గించింది. 'అవును. ఎవరు కడితే నేం'— అన్నాడాయన. 'నా విషయంలో మీరు శ్రమపడ నవసరం లేదు — తీసుకోనండి' — అని చేతులో పెట్టాడు జానకిరామయ్య.

మామయ్య తెల్లబోయాడు. ఇదంతా తాను— అన్నమాట ఫలితమే అన్న సంగతి యింకా ఆయనకు జ్ఞప్తికి యుండియుండదు —.

'ఏమయ్యా — ఈలా విపరీతంగా మాట్లాడుతావ్. కారణ మేమిటి?' — ఆయన ప్రశ్నించాడు తానేమీ యెరగనట్లుగా—

'ఏం లేదు మామగారూ. పాతగొడవలు యెత్తి మీమనస్సు బాధపెట్టుకొనటం — నన్ను నేను బాధించుకొనటం — .. నే జీతం కట్టుగోకల్గినప్పుడు మీ కెందుకే శ్రమ' — అన్నాడు జానకి రామయ్య అంటీ ముట్టనట్లుగా.

మామయ్య తిరిగి యేమీ మాట్లాడలేకపోయాడు; అయితే అల్లుని విషయంలో తానేదో — లోటుగా నడుచుకొన్నట్లుగా మాత్రం ఆయన గ్రహించుకొన్నాడు. ఫలితం — అల్లుని స్వేచ్ఛకు యింట్లో యెవరూ భంగం కల్గించవద్దని — అతని యిష్ట ప్రకారం నడుచుకోవలసిందనీ ఆయన ఆజ్ఞాపించటం.

అల్లుడియందు అత్తగారికి ఆపేక్ష యెల్లప్పుడూ ఒకే విధంగా ఉంది.. కూతురు పెద్దదవుతున్నకొద్దీ— అల్లునిమీద ప్రేమ అధికమవ మొదలు పెట్టింది.

చదువుకాలంలో వీలయినప్పుడు పోయి తల్లి దండ్రుల్ని చూసి వస్తూండేవాడు జానకిరామయ్య. 'ఏరా ... మీ అత్తమామలు నిన్నేవిధంగా చూస్తున్నారురా' అని యెంత ప్రశ్నించినా — యేం జవాబు చెప్పకుండా ఉండిపోయేవాడు. వాళ్ళు మరో అభిప్రాయంతో ... అబ్బాయి వివాహం చేసుకొన్న సమయంనుంచి 'అత్తవారి మనిషి అయిపోయాడని' అనుకొని బాధపడుతుండే వారు.

జానకిరామయ్య యింటరు సీనియరులోనికి వచ్చేసరికి — అంతకుముందే భార్య రజస్వలయి ఉండటంచేత — కావలసిన పనులన్నీ పూర్తి చేసుకొని — కాపురానికొచ్చింది.

లక్ష్మి కాపురానికొచ్చి ఒక మాసం కాలం అత్తవారింట్లోనూ, మరోమాసం పుట్టింటిలోనూ గడిపింది. తిరిగి కాలేజీలు తెరిచారు. ఈమారు.. జానకిరామయ్యకు అత్తవారింట్లో ఉండటానికి మనస్కరించలేదు. భార్య యేలాగూ కాపురానికొచ్చింది గనుక — తానే కాపురం పెట్టుదామనుకొన్నాడు. జానకిరామయ్య! ఈవిధంగా అయిన అభిప్రాయం అతనిలో అయితే ఉందిగాని — కారణం అటు తల్లి తండ్రులకు తెలియదు.

'తాను విడిగా కాపురం పెట్టదలచుకొన్నట్లు'—మామయ్యతో చెప్పాడు జానకిరామయ్య.

ఆయన అవిధంగా వినటంతోటే ఆశ్చర్య పడ్డాడు. అదేమిటోయ్ కొత్తగామాట్లాడుతున్నావ్.. నీవు చదువుకొన్నంతకాలం నాయింటివద్దనే ఉండి చదువుకో. మొగపిల్లక్రింద చూసుకొన్నా, ఆడపిల్లక్రింద చూసుకొన్నా అమ్మాయి ఒక్కత్తేగదా... నువ్వు మాకొక్కడివేగదా... ఏమిటో విడిగా కాపురం పెట్టి ఏమిటే నువ్వు పొందే ఆనందం? 'ఏమయినాసరే- కాపురం పెట్టి తీరాల్సిందే, మీ మాటలకు వ్యతిరేకంగా నడుచుకొంటున్నందుకు మన్నించండి' అన్నాడు జానకిరామయ్య.

మామగారు తిరిగి యేం మాట్లాడలేకపోయాడు. అంతకూ కారణం తానొకప్పుడు-డబ్బు విషయంలో చూపిన లోభిత్వమేమో అని అనుకొన్నాడాయన. భార్యను తీసుకొని స్వంత కాపురం పెట్టుకొంటానంటే — ఏ పిల్ల తండ్రి కాదంటాడు?- కాదంటే ముందు భవిష్యత్తు యే విధంగా ఉంటుందో ముందే వారు ఊహించుకొనకుండా ఉంటారా?

'సరే నీయిష్ట మొచ్చినట్లుగా కానియ్య' అన్నాడాయన జానకిరామయ్య చొరవకు ఆశ్చర్య పడుతూ!

జానకి రామయ్య విడిగా కాపురం పెట్టిన సంగతి తల్లితండ్రులకు కొద్దిరోజులుదాకా తెలియదు. అత్త మామలూ- తమ కుమారుడూ ఒకటేగా తల బోస్తున్నవారికి— కుమారుడు విడివిగా కాపురం పెట్టడం సంగతి తెలియటంతోటే ఎంతో ఆశ్చర్యం కలిగింది. వాళ్ల మధ్య యేదో తుఫాను రేగి ఉంటుందని మాత్రం జానకి రామయ్య తల్లి తండ్రులు ఊహించారు. అబ్బాయి ప్రయివేట్లు—చదువుతూ కూడా చెబుతున్నాడనీ — అరవై రూపాయలు సంపాదించుతున్నాడని సంగతి తెలిసే సరికి ఒక వేపు సంతోషమూ మరోవైపు విచారము జానకిరామయ్య తండ్రికి కల్గాయి. చదువుతూ ధన సంపాదన చేస్తున్నాడని— సంతోషమూ, మామగారింట్లో ఉండి-ఆ డబ్బు నిలవ కాయకుండా — ఖర్చు పెడుతున్నాడని విచారమూ!

లక్ష్మి కాపురానికి వచ్చినతర్వాత చదువు మీద కంటే — ఆదాయం సంపాదించటంమీద జానకి రామయ్యకు శ్రద్ధ యెక్కువయింది. సాయంకాల వేళల్లో చెప్పే ప్రయివేట్లతోపాటు— మరి కొన్ని కొత్త ప్రయివేట్లనూ అతడొప్పుకొన్నాడు.. నెలకు ఆదాయం నూరు రూపాయలు తెస్తున్నాడు. అయితే నూరు రూపాయలూ — కొత్తకాపురం గనుక — కన్పించకుండా ఖర్చయి పోతున్నాయి. లక్ష్మికి కూడా... జానకిరామయ్య స్వయంగా కాపురం పెట్టడం యిష్టంలేదు. ముభావంగా— కొంతకాలం ఊరుకొన్నా- కొద్దికాలం పోయాక— అంటే మరి జానకిరామయ్య యూనివర్సిటీ పరీక్షలకు హాజరవు తాడనగా- చిన్న సలహా నిచ్చింది. అనవసరంగా డబ్బు వ్యయం చేయటం కంటె- సంపాదించే డబ్బు ఏ సేవింగ్సులోనో వేస్తూ- తన వాళ్ళింట ఉండటం చాలా మంచిదని!

జానకిరామయ్యకు స్వతహాగా ఆ సలహా రుచించలేదు. భార్య చెప్పింది కాబట్టి 'అలాచిద్దాంలే' అన్నాడు.

అంతా ఒకే ఊళ్ళో వాళ్ళవటంవల్ల యీ మాట తిరిగి లక్ష్మికి వీలయినప్పుడు తల్లి తండ్రులదగ్గర జారింది...కథ మళ్లా అనుకూలపడుతున్నందుకు సంతోషిస్తూ మామయ్య తిరిగి జానకిరామయ్యను తన యింటికి వచ్చి ఉండవల్సిందని చెప్పాడు.

జానకిరామయ్య 'అవసరంలేదు. మామగారూ...'అని తప్పించుకొని బ్రతిమాలించుకో తలచాడు.

మామ 'అలాంటే యేలాగా... అమ్మాయి... పనులు చేసుకోలేదు.. ఇక్కడ మేం ఉండగా... దాన్ని బాధపెట్టడం యెందుకూ ... ఇంతమంది ఉండగా దాన్ని సమయంలో బాధపెట్టడం భావ్యం కాదు.'

జానకిరామయ్యకు విషయం అర్థమైంది. మరీ మారుతాను అడ్డు చెప్పలేకపోయాడు. తన భార్య కడుపుతో ఉంది... ఆమె తనతో చెప్పిన విధంగా నడుచుకొనటమే యీ సందర్భంలో శ్రేయస్కరం

జానకి రామయ్య మరే అడ్డూ చెప్పలేదు. తిరిగి మామయ్య గారింటికి కాపురాన్ని మార్చాడు. కుమారుడు చేస్తున్న పనులేవీ సత్యనారాయణకు అర్థంగాకుండా పోతున్నాయి. తనతో యే విషయం చెప్పకుండా తనేవిధంగా కలగచేసుకొంటాడు? ఆయన మాట్లాడక వూరుకొన్నాడు.

యూనివర్సిటీ పరీక్షల్లో జానకిరామయ్య నెగ్గాడు; అది తన స్వశక్తివల్ల, సంపాదనవల్లా జరిగిన ఫలితమైనా లోకులు మాత్రం మామగారు చదివించారనే తలబోశారు. తల్లితండ్రులకు మాత్రం కుమారుడు పరీక్షలో కృతార్థుడయ్యాడన్న సంతోషం మిగిలింది!

కుమారుని చదువుకు అంతటితో స్వస్తివాచకం పలికించి - యేదో ఒక ఉద్యోగం చేయవలసిందని సలహా యిద్దామనుకొన్నారు. జానకిరామయ్య తల్లితండ్రులు.

తండ్రితో అయితే జానకిరామయ్యే ముందుగా చెప్పాడు. 'మామ బి. ఏ. పూర్తిచేయమంటున్నారు. అది చదివి ఉద్యోగంకోసం ప్రయత్నం చెయ్యొచ్చు. అని.

వ్యక్తిత్వం సంపాదించుకొని — ఆవిధంగా మాట్లాడుతున్న కుమారుడికి తానేం అడ్డు చెప్పగల్గుతాడు?

'కాస్త ముందు వెనకలు—యోచించి కానియ్యి' అని మాత్రం అన్నాడు తండ్రి—.

'అలాగే' — అన్నాడు జానకిరామయ్య.

జానకిరామయ్య తిరిగి కాలేజీలో చేరాడు. అతడు తిరిగి చదవటం కేవలం తల్లితండ్రులకు యిష్టం లేదు. అమ్మాయి సమర్తాడి కూర్చుంది ... ఏలాగో పొట్టపోసుకొంటున్న తాను కుమార్తెకు వివాహం చేయటం కష్టం—

'అబ్బాయి యేదో ఆసరా యిచ్చాడు —'అని ధైర్యంగా ఉండటానికి కూడా వీలు లేకుండా ఉంది' అబ్బాయి చదువు మాని ఉద్యోగం చూసుకొంటే గదా. తమ సంగతి చూడవచ్చేది!

ఈవిధంగా...సత్యనారాయణ బాధపడ్తూంటే —పరిస్థితులు అనుకొన్నట్లుగా గాక, అనేక విధాలుగా మారిపోయాయి.

జానకిరామయ్య యింటికి రావటం బహు తక్కువ అయిపోయింది. అత్తమామల్ని గురించి— తానిదివరకు యే విధమైన అభిప్రాయం కల్గియుండేవాడో ఆ అభిప్రాయం మారిపోయి - వారిమీద ఎడలేని భక్తివిశ్వాసాలు పుట్టుకొనివచ్చాయి. భార్య అతనికి — నాంది అయింది ... ఆమె చెప్పినమాట వేదవాక్యం అయి కూర్చొంది ... అమె చెప్పిన ప్రకారం పైన సంపాదించిన, సంపాదిస్తున్న ధనం బ్యాంకిలో పడేయటం ప్రారంభించాడు.. రెండు మూడు మార్లు వేయటం జరిగిందో లేదో గాని, అప్పుడే స్వార్థం, వానిలో ప్రబలటం మొదలు పెట్టింది. —ఏదో అండగా ఉంటుందని — చెల్లెలు పెళ్లిసమయంలో ఉపయోగకరంగా ఉంటుందని అతడు ప్రారంభంలో వేశాడు!. కాని — మరి రెండు మూడు మార్లు వేసేటప్పటికి ఆ ఉద్దేశం — మరో మారురూపాలు పొందింది. భార్యకేదైనా నగ చేయించటం గాని — పుట్టబోయే బుల్లిబాబుకు... ఏమయినా వస్తువు చేయించటంగాని...

లక్ష్మి అన్నిటికన్నా ఉత్తమమయిన సలహా యిచ్చింది. ఆ డబ్బుకు — మరి నాలుగు రాళ్ళు చేర్చి — యేదో చిరకాలం ఉండే వస్తువును తయారు చేసుకోవటం మంచిదని - ఏమయితే నేం - వాని ఉద్దేశం — భార్య ఉద్దేశం — ఒకటే. వేస్తే డబ్బు వేస్తూండాలి గాని, తీయగూడదు ... జానకి రామయ్యలో అప్పుడే — అంటే భార్య రావటం తోటే స్వార్థం ప్రారంభమయింది.

జానకిరామయ్య యింటరు చదువుల్లోనే — సత్యనారాయణ యెంతో బాధపడ్డాడు కుటుంబాన్ని పోషించటానికి - తోడు బి. ఏ. చదువు సాగిస్తే కాని — చదువు మానునని అతడు చెప్పటం. ఆయన్ని మరింత బాధ పెట్టింది.

ఏలాగో రోజు లెక్క పెడుతూ కాలక్షేపం చేస్తూంటే జానకి రామయ్య బి. ఏ పరీక్షకు కూర్చోవటం గూడా జరిగింది. ఇకనుంచయినా తన కష్టాలు విముక్తి పొందుతాయని వూహించాడు సత్యనారాయణ.

బి. ఏ. పరీక్షలో కృతార్థుడవటం- నిజంగా జానకి రామయ్యకు శుభసూచకం. ఎలా ప్రయత్నించాడో యేమోగాని మామ జానకి రామయ్యకు చదువు పూర్తయీ పూర్తవటంతోటే యిప్పించకలిగాడు సర్కారు ఉద్యోగం!

జానకి రామయ్య జరిగిన రెండు సంవత్సరాల కాలంలోనూ, సుమారు రెండు వందలదాకా డబ్బు నిలవ వేశాడు:... డబ్బు నిలవ వేస్తున్నందుకు అతడికెంతో సంతోషంగానే ఉన్నది. లక్ష్మి... పుట్టిన కుమారుడికి యేదో నగ చేయించ వల్సిందని బాధపెట్ట సాగింది... కాని యేయోచనా చేయకుండా— దాన్ని సేవింగ్సులో వేసి గుప్తపరచాడు జానకి రామయ్య:

కొంతమంది వ్యక్తులు పై అంతస్థులోకి వెళ్లేసరికి తమ పూర్వ స్థితిని మరచిపోతారు. తామెవరో - యేలాటిస్థితిలో ఉండేవారో కనీసం ఊహించనయినా ఊహించరు.

జానకి రామయ్య సంగతీ అంతే. ఇంటరుమీడియేటు పూర్తియేదాకా- యింటి వ్యవహారాల్లో జోక్యం కలిగించుకోనటం తక్కువయినా—తండ్రితో వ్యవహారసంబంధం తక్కువయినా, వస్తూపోతూండటం హెచ్చుగా జరుపుతూండే వాడు. బి. ఏ. చదువుతో అది అడుగంటింది... రాక పోకలు చాలా తక్కువగా ఉండేవి. చుట్టపు చూపుల క్రింద అప్పుడప్పుడు ఉండేవి! సరి, బి. ఏ. పరీక్షలో కృతార్థుడవటం— ఉద్యోగం సంపాదించుకోనటం జరగటంతోటే జానకి రామయ్య పూర్వస్థితి అంతా చక్కగా మారిపోయింది. ఇప్పుడంతా తన స్వశక్తి మూలకంగానే అన్న ఉద్దేశంలో— అతనిలో అహం రేకెత్తింది.

జానకి రామయ్యలో తన ఉద్యోగం, తన భార్య, తన బిడ్డడు, తన... మరి..మరి తమవారి సంగతులకన్న మరి క్రొత్తవియేవీ గోచరించేవి కావు— తన అభివృద్ధి తాను కోరుకోనటంతో యితరుల సంగతి— చివరకు—తన్ను నవమాసాలు మోసి పెంచిన తల్లి సంగతి— తన్ను పెద్ద చేసి పెద్ద చదువు చదివించిన తండ్రి సంగతీ— మరి— వయస్సులో ఉన్న తన చెల్లికి పెళ్లిచేయాల్సి ఉన్నదన్న సంగతి గూడా స్ఫురణకు వచ్చేవి కాదు.

సత్యనారాయణ మరి ఓపికతో ఉండలేక పోయాడు. వయస్సు ముదిరిపోతున్న కుమార్తెకు వివాహం చేయాల్సిన అవసరం ఉన్నది. యేలాగయినా ఏదో విధంగా ఆమెకు వివాహంచేసిఆమె కన్నెచెర వదిలించాలి.

జానకిరామయ్యచదువు పూర్తవటంతో చెల్లెలు విషయం యోచిస్తాడనీ—యేదో చక్కటి సంబంధం చూసి వివాహం చేయిస్తాడనీ తల్లీతండ్రీ అనుకొన్నారు. జానకిరామయ్యమనస్సులో ఆ ఉద్దేశమే లేదన్న సంగతి పాపం వాళ్లకు తెలియదు. ఉద్యోగంఅయిన కొద్దిమాసాల కాలం ఆ మాట జానకి రామయ్యనోట వినాల నే కుతూహలంతో —ఆసక్తితో యెదురు చూచారు. కాని జానకిరామయ్య చివరకు ఆ ప్రసక్తి యెత్తకుండా ఉండేసరికి—సత్యనారాయణే ఆ విషయాన్ని యెత్తి జానకిరామయ్యను అడగవలసివచ్చింది. జానకిరామయ్య దగ్గరకు వెళ్లి—

'ఏం నాయనా— పెద్దవాడవయి మంచి అభివృద్ధిలోనికి వచ్చావ్'—అన్నాడు సత్యనారాయణ నాందీ ప్రస్తావనగా!

'మీ చలవవల్లనే—నే చదవటం జరిగింది'—అని ఊరుకొన్నాడు జానకిరామయ్య!

'నాయనా—చెల్లెమ్మ పెండ్లివిషయం—ఏదో తొందరగా తేల్చివేస్తే చాలా బాగుంటుందిగా'—అన్నాడు సత్యనారాయణ.

'అలాగే కానివ్వండి—దానికేం'—అన్నాడు కొడుకు—

'ఆ...నీ విల్లా జవాబిస్తావని నాకు తెల్సు. పెద్దచదువు చదివిన నువ్వు పెద్దసంబంధం వెతికి తెచ్చి నీ చెల్లికి వివాహం చేస్తావన్న సంగతి నాకు తెల్సు.' అన్నాడు సత్యనారాయణ.

జానకిరామయ్య విషయం గ్రహించుకోగలిగాడు. కానయితే చాలాకాలంవరకూ అతడు ముభావంగానే ఉండిపోయాడు.

'ఏం? ఏమంటావు నాయనా'—అని ప్రశ్నించాడు సత్యనారాయణ జానకిరామయ్య జవాబుకోసం యెదురుచూస్తూ—

'చెప్పేదేమిటి నాన్నా! మీరు పెద్దలు. మీరేవిధంగా జరపదలచుకొన్నారో ఆవిధంగా చేసెయ్యండి'—అన్నాడు జానకిరామయ్య.

సత్యనారాయణ జానకిరామయ్య సుముఖంగానే ఉన్నాడని ఉద్దేశపడ్డాడు.

అందుకనే తిరిగి అన్నాడు: నాయనా నీకు తెలియంది యేమీ లేదు. ఏదోవిధంగా జరుపుదామనుకొన్నా. ఓ వెయ్యిరూపాయలు కావాలి... అయిదువందలదాకా—ఏదో—సంపాదించాలి. అవి కట్నకానుకలకు సరిపోతాయి. మరి వివాహంకోసం-అయిదువందలు కావాలి. కుటుంబంలో మనుష్యులం మనలో మనం యేదోవిధంగా సర్దుకొనిపోవాలి. అయిదువందలు చూసినట్లయితే చెల్లెలికి వివాహం చేసి—ఒక యింటిదాన్ని చేసినవాడివవుతావ్!'

జానకిరామయ్య కంతటితో విషయం అంతా అవగాహన అయింది...నాలుగువందలరూపాయలు! తాను సేవింగ్సులో నిలవ వుంచినమొత్తమే ఉంది. నాలుగువందల చిల్లర!

ఈలాంటి సమయంలో తండ్రికి ఆదుకొని సహాయం చేసినట్లయితే తాను చదివిన, చదివించిన పెద్దచదువు ఉపయోగం కన్పిస్తుంది. తల్లితండ్రులు సంతోషిస్తారు. తనకు వివాహంచేసినందుకు చెల్లెలు ఆనందించుతుంది.

ఈ ఆలోచనలు జానకిరామయ్యలో కలిగాయ్-ఒక్కమారు—తన చదువు—తండ్రి కష్టాలు...స్ఫురణకు వచ్చినాయ్. తాను పెద్దచదువు చదువుటకు వెళ్లేముందు తండ్రికిచ్చిన వాగ్దానం జ్ఞప్తికి వచ్చింది. మరి అడ్డుమాట చెప్పలేకపోయాడు.

'అలాగే నాన్నా యింటివిషయం—మరి నాకు మీరు విడిగా చెప్పాలా...మీ రన్నవిధంగా అయిదువందలూ యిస్తాను. చెల్లెలు వివాహం దిగ్విజయంగా జరగటమే నే కోరుకొనేది...త్వరలోనే ఆ సొమ్ము మీ కందిస్తాను' అన్నాడు జానకిరామయ్య!

సత్యనారాయణ సంబరపడుతూ యింటికి వెళ్లాడు—అతుక్కుతగ్గ బొంతవిధంగా—జానకిరామయ్యకు తగిన సంబంధమే లభించింది...

జానకిరామయ్య ఇచ్చిన వాగ్దానం మనస్సులో పెట్టుకొని-ఎంతోకాలం మూటకట్టిఉంచిన అయిదువందల రూపాయలు వెచ్చించి పెండ్లినెచ్చాలు తెప్పించాడు.

జానకిరామయ్యకు ఉదారత్వం కలిగినా, లక్ష్మి దాన్ని మాయంచేసింది. ఆ డబ్బు మరోవిధంగా ఉపయోగించటానికి వీల్లేదని—తనకుగాని తన పుత్రునికిగాని యేదోవిధంగా ఉపయోగించాల్సిందని పట్టుపట్టుకొని కూర్చుంది. ఆడవాళ్ల చేతుల్లో మొగాడు యేం చేస్తాడు? ఈ రోజుల్లో—ప్రతీ చదువుకొన్న భర్తా భార్యకు—ఏవిధంగా దాసుడవుతున్నాడో అదేవిధంగా జానకిరామయ్య తన భార్యకు దాసుడయ్యాడు.

ఆమె కోరుకొన్న హారం...నాలుగువందల రూపాయల డబ్బుతో వచ్చిపడ్డది! యింటికి—తండ్రికి—ఉత్తరంగూడా వ్రాశాడు భార్యాదాసుడు—తానేదో యెక్కడనుంచో తెచ్చి యిద్దామని తలపోశాననీ—కానీ లభ్యపడలేదనీ—యేదోవిధంగా చూసుకోవలసిందనీ తెలియపరుస్తూ!

సత్యనారాయణ నివ్వెరపడటం సంగతి అటుంచి తన తిప్పలు తాను పడవలసివచ్చింది—ఏం చేస్తాడాయన పాపం!—తలదాచుకొంటున్న ఆ యిల్లు కొంచెం—యోచనచేయకుండా తాకట్టు పెట్టి అయిదువందలు తెచ్చి పెండ్లి అయిందనిపించాడు!

ఇంటిమనిషి—సమయానికివచ్చి, తండ్రికి ఆదుకొనలేదుసరిగదా...చుట్టంవిధంగా — వివాహ సమయానికి వచ్చి—అంటీ ముట్టనివిధంగా ఉండి పెండ్లి అవటంతోటే భార్యతోసహా తిరిగి వెళ్లిపోయాడు జానకిరామయ్య!

'డబ్బుదొరక లేదు—ఇద్దామనుకొన్నా'—అని జానకిరామయ్య అన్నప్పటికీ లక్ష్మిమెడలోని కొత్తగొలుసు—యెవర్నీ— అతని మాట నమ్మనివ్వ లేదు.

అంతా పరిశీలించిన సత్యనారాయణమాత్రం—అంతా పూర్తయిన తర్వాత నిట్టూర్పుతూ! 'అంతా పెద్దచదువుమహత్యం—నా బిడ్డ నా యింట ఉంటే యీవిధంగా జరిగియుండేది కాదుగదా' అని అనుకొన్నాడు; కాని ప్రయోజనం?